## క్లుప్తంగా

### పురుగు మందుల దుకాణాలు తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ

**పొదిలి:** పట్టణంలోని పలు పురుగుమందులు, విత్తనాల దుకాణాలను ఏఓ జైనులాబ్దిన్ సోమవారం తనిఖీ చేశారు. దుకాణాల్లోని నిల్వలు, రికార్డులు సరిపోల్చి పరిశీలించారు. బిల్లులు లేని పురుగుమందులను, విత్తనాలను విక్రయించరాదని చెప్పారు. దుకాణదారుల బిల్ బుక్స్, టాక్స్ ఇన్‌వాయిస్‌లు, స్టాక్ బోర్డుల నిర్వహణను పరిశీలించారు. నకిలీ పురుగుమందులు, విత్తనాలు విక్రయించినా, రైతులకు బిల్లులు ఇవ్వక పోయినా యజమానులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### మల్టీ- కే పిచికారీ చేసుకోవాలి


శనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఓ బాలాజీనాయక్

**బేస్తవారిపేట:** శనగ పంటలో పురుగుమందులతోపాటు మల్టీ-కే మందును పిచికారి చేసుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకుడు డీ బాలాజీనాయక్ అన్నారు. మండలంలోని కొత్తపల్లెలో ఫెంగల్ తుఫాన్‌తో నష్టపోయిన పంటలను సోమవారం పరిశీలించారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని తెలిపారు. పండించే పంటలకు ఇన్సూరెన్స్ చేయించుకోవడంతో పంటలు నష్టపోయినప్పుడు నష్టపరిహారం అందుతున్నారు. ఈనెల 15వ తేదీలోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, ఏఈఓ ఆదిగణేష్, వీఏఏ సత్యనారాయణ పాల్గొన్నారు.

### సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి


ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

**మార్కాపురం టౌన్:** మున్సిపాల్టీల్లో పనిచేస్తున్న కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అందె నాసరయ్య డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట రాష్ట్ర వ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పీఎఫ్ ఖాతాలను సరిచేయాలన్నారు. బదిలీ కార్మికుల పిల్లలకు వేతనం ఇవ్వాలని, పెన్షన్ ఇవ్వాలన్నారు. కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు, బట్టలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రం మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి షేక్ కాశిం, నాయకులు హరిబాబు, ఎం.బాలవెంకటేశ్వర్లు, దర్గయ్య, కోటమ్మ, కాశింబీ పాల్గొన్నారు.

### విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు


వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

**తర్లుపాడు:** మండలంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు చేసి 36 కేసులు నమోదు చేశారు. 33 బృందాలుగా విడిపోయిన అధికారులు పలు గ్రామాలు తిరుగుతూ 2,532 సర్వీసులు చెక్ చేశారు. అధిక లోడ్ వినియోగిస్తున్న 36 మందిపై కేసులు నమోదు చేసి 1.36 లక్షల రూపాయల ఫైన్ విధించారు. తనిఖీల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పీవీ నాగేశ్వరరావు, హైమవతి, కంభం, గిద్దలూరు డీఈఈలు, మండలాల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.


గుంతలమయమైన తర్లుపాడు రోడ్డు


మార్కాపురం - తర్లుపాడు సింగిల్‌రోడ్డు

# నరకానికి దారి..

- అధ్వానంగా మార్కాపురం-తర్లుపాడు రోడ్డు
- ఈ రోడ్డుపైనే 12 గ్రామాల ప్రజల రాకపోకలు

**తర్లుపాడు:** కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రోడ్ల మరమ్మతులను గాలికొదిలేశారు. సంక్రాంతికి రోడ్ల మరమ్మతులన్నీ చేస్తామని కూటమి నాయకులు గొప్పగా చెబుతున్నా ఆచరణలో ప్రారంభం కాలేదు. మార్కాపురం - తర్లుపాడు రోడ్డు నరకానికి చిరునామాగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. అసలే సింగిల్‌రోడ్డు... ఆపై అధ్వానంగా మారడంతో ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే నరకమే. సీతానాగులవరం, తర్లుపాడు, మీర్జపేట, తాడివారిపల్లి, నాగెళ్లముడుపు, చెన్నారెడ్డిపల్లి, గొల్లపల్లి, ఉమ్మారెడ్డిపల్లి, వేములపాడు, కనిగిరి, బోడిచర్లమీదుగా కంభం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో సుమారు 12 గ్రామాల ప్రజలు ప్రతిరోజూ ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగించాల్సి ఉంది. దీంతోపాటు మండల కేంద్రాలైన కంభం, తర్లుపాడు, వేములపాడు మీదుగా కనిగిరి వెళ్లే బస్సులు కూడా ఈ రోడ్డుగుండా వెళ్లాల్సిందే. సింగిల్‌రోడ్డు కావడంతో రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపి నిధులు మంజూరయ్యాయి. అయితే ఎన్నికలు రావడంతో నిలిచిపోయాయి. అప్పట్లో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టారు. ప్రస్తుతం రోజుకు అటు.. ఇటుగా 200 వాహనాలు తిరుగుతున్నాయి. వీటితోపాటు స్కూల్ బస్సులు, ఆటోలు అదనంగా తిరుగుతాయి. మార్కాపురం నుంచి తర్లుపాడుకు సుమారు 10 కిలోమీటర్ల దూరం ఉంది. సాధారణంగా అయితే పదినిముషాల్లో చేరుకోవచ్చు. రోడ్డు బాగోలేకపోవడంతో సుమారు అరగంటకు పైగా ప్రయాణ సమయం పడుతోంది.


ఎదురుగా వస్తే కిందకు దిగాల్సిందే

> **రోడ్డును వెడల్పుచేసి మరమ్మతులు చేయాలి**
>
> 
>
> మార్కాపురం నుంచి తర్లుపాడు రావాలంటే రోడ్డు బాగోలేకపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి డబుల్ రోడ్డు వేయడంతోపాటు రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలి.
>
> – అక్బర్ అలీ, కో ఆప్షన్ సభ్యులు

# సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సభలు


అర్జీలు స్వీకరిస్తున్న ప్రత్యేకాధికారి


ఎల్‌కోట ఎస్సీ కాలనీలో మాట్లాడుతున్న తహసీల్దార్

**గిద్దలూరు రూరల్:** గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని మోడంపల్లె గ్రామంలో స్థానిక తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో స్థానిక ప్రజలు వారి సమస్యలను అర్జీల రూపంలో అధికారులకు వివరించారు. రెవెన్యూ సదస్సులో నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.రవికుమార్ అర్జీలు స్వీకరించారు. రేషన్‌కార్డుల్లో పేరు మార్పులు, రేషన్‌కార్డుల కోసం, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేరు మార్పులు వంటి సమస్యలపై మొత్తం 23 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, ఆర్ఐ భాస్కర్‌రావు, వీఆర్‌ఓ వై.పి.రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

**తర్లుపాడు:** మండలంలోని చెన్నారెడ్డిపల్లిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తర్లుపాడుకు చెందిన భూ ఆక్రమణదారుడుపై పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. తమ వారసత్వ భూములు అక్రమంగా ఆన్‌లైన్ పొందినట్లు బాధితులు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి అర్జీ రూపంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ల్యాండ్ గ్రాబింగ్ చట్టం కింద ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆక్రమణదారుడిపై తర్లుపాడుకు చెందిన తాడిబోయిన పెద్దక్క ఒంగోలులో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కూడా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

**కొనకనమిట్లలో...**

**కొనకనమిట్ల:** గ్రామాల్లో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బసాపురంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే కందులకు వివరించారు. గ్రామ సభలో పలు సమస్యలపై 22 అర్జీలను ప్రజలు అందజేశారు. గ్రామ సభలో తహసీల్దార్ ఆవుల సురేష్, ఆర్ఐ మహదేవరెడ్డి, వీఆర్‌ఓలు రమేష్, రాణప్రతాప్‌రెడ్డి, కార్యదర్శి పిచ్చయ్య పాల్గొన్నారు.

**ఎల్‌కోట గ్రామసభలో 51 అర్జీలు**

**కంభం:** మండలంలోని ఎల్‌కోట గ్రామంలో సోమవారం రెవెన్యూ గ్రామ సదస్సు నిర్వహించారు. ముందుగా తహసీల్దార్ వి.కిరణ్ రెవెన్యూ సిబ్బందితో కలసి గ్రామంలోని ఎస్సీ కాలనీలో పర్యటించి సొంత ఇల్లు లేని వారిని గుర్తించి గృహాల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. గ్రామసభలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి హాజరై మాట్లాడారు. గ్రామ సభలో 51 అర్జీలు రాగా ఆన్‌లైన్ నమోదుకు 30, ఆక్రమణలపై 5, రేషను కార్డు 2, డిజిటల్ సంతకాలకు 2, అసైన్‌మెంట్ భూమి మంజూరుకు 5, ఇతర సమస్యల కోసం 7 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ పద్మశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**వివాదాస్పద భూముల పరిశీలన**

**మార్కాపురం రూరల్:** మండలంలోని జమ్మనపల్లిలో పొలాలకు వెళ్లే రస్తా విషయంలో గ్రామస్తుల మధ్య జరుగుతున్న గొడవను, సమస్యను పరిష్కరించినట్లు తహసీల్దార్ చిరంజీవి చెప్పారు. సోమవారం జమ్మనపల్లిలో రెవెన్యూ సదస్సు అనంతరం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. జమ్మనపల్లిలో మూడు చోట్ల గ్రామస్తులకు ఉమ్మడి సమస్యలు ఉన్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించినట్లు తెలిపారు. ఇరువర్గాలు పిలిచి రస్తా సమస్యను పరిష్కరించి రైతులు వెళ్లేందుకు రోడ్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 39 అర్జీలు వచ్చినట్లు వివరించారు. ఇందులో 9 అర్జీలను పరిష్కరించినట్లు చెప్పారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ చిరంజీవి


బసాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల

# అర్జీలను పరిష్కరించండి

- సబ్ కలెక్టర్ త్రివినాగ్

**మార్కాపురం:** ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిష్కరించాలని సబ్ కలెక్టర్ త్రివినాగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ప్రజలు ఇచ్చిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపారు. అర్ధవీడు మండలం అయ్యవారిపల్లికు చెందిన ఎం.ఎల్లయ్య తన భూమిని వేరేవారు ఆక్రమించి ఆన్‌లైన్ చేయించుకున్నారని, విచారణ జరిపి తమ డాక్యుమెంట్లు పరిశీలించి తన భూమిని తనకు ఇప్పించాలని అర్జీ ఇచ్చారు. త్రిపురాంతకం మండలం గొల్లపల్లికి చెందిన జి.వీరమ్మ తమ గ్రామ పరిధిలో ఉన్న భూమిని పట్టా భూమిగా తన పేరుపై మార్పుచేయాలని అర్జీ ఇచ్చారు. కొమరోలు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన టీసీహెచ్ మార్తయ్య తన గ్రామంలో తన పొలాన్ని వేరే వ్యక్తి ఆక్రమించుకున్నాడని, తనను పొలంలోనికి వెళ్లకుండా అడ్డుకుంటున్నాడని, తనకు న్యాయం చేసి తన పొలాన్ని తనకు ఇప్పించాలని కోరారు. ఇంకా వివిధ గ్రామాల నుంచి పలువురు అర్జీదారులు సమస్యలపై ఇచ్చిన అర్జీలను కార్యాలయ సిబ్బంది స్వీకరించారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

## మాజీ ఎమ్మెల్యే కేపీని పరామర్శించిన కారుమూరి


కేపీని పరామర్శిస్తున్న కారుమూరి, బూచేపల్లి

**మార్కాపురం:** మాజీ శాసనసభ్యుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కేపీ కొండారెడ్డిని సోమవారం మార్కాపురంలోని ఆయన నివాసంలో ఆ పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి తదితరులు పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కేపీ కొండారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన పలు సంఘటనలు గుర్తు చేసుకున్నారు. వీరి వెంట మాజీ ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, ఉడుముల శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

## డాక్టర్ జార్జి కళాశాలకు నాక్ 'ఎ' గుర్తింపు

- కళాశాల టెక్నికల్ అడ్వైజర్, మాజీ మంత్రి సురేష్ వెల్లడి


కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, కళాశాల సిబ్బంది

**మార్కాపురం:** జిల్లాలో మొట్టమొదటి ఇంజినీరింగ్ కళాశాల పట్టణంలోని డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజినీరింగ్ కళాశాలకు నాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ ) 'ఎ' గుర్తింపు లభించినట్లు కళాశాల టెక్నికల్ అడ్వైజర్, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. సోమవారం సాయంత్రం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన వివరాలు తెలిపారు. 28 సంవత్సరాల క్రితం జిల్లాలోనే మొదటి ఇంజినీరింగ్ కళాశాలను తన తండ్రి శామ్యూల్ జార్జి మార్కాపురంలో స్థాపించి సాంకేతిక విద్యను జిల్లా విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారన్నారు. అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, ప్లేసుమెంట్ల ద్వారా వేలాది మంది ఉద్యోగాలు కల్పిస్తూ కళాశాలలో క్రికెట్ స్టేడియం, ఇంగ్లిష్ ల్యాబ్, ప్లేసుమెంటు సెక్షన్ ఇలా అన్నీ విభాగాల్లో అత్యున్నతమైన సేవలు అందించామన్నారు. నాలుగేళ్ల క్రితం నాక్‌కు దరఖాస్తు చేసుకోగా అప్పటి నుంచి సుదీర్ఘంగా కళాశాలను పరిశీలించి గత ఆగస్టులో బెంగళూరుకు చెందిన స్వయం ప్రతిపాదిక కలిగిన సంస్థ నాక్ వైస్ చాన్సలర్, మరో ఇద్దరు ప్రొఫెసర్ల బృందం రెండు రోజులపాటు కళాశాలలోని అన్నీ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించిందని, వారికి కళాశాలలో ఉన్న సౌకర్యాలు, బోధనా తదితర అంశాలను హెచ్‌ఓడీలు వివరించారని చెప్పారు. ఈ నెల 6వ తేదీన నాక్ సంస్థ కళాశాలకు నాక్ 'ఏ' సర్టిఫికెట్‌ను శామ్యూల్ జార్జి కళాశాలకు మంజూరు చేస్తూ లేఖ పంపారని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రాజబాబు, డీన్ మస్తానయ్య, డానియేల్ పాల్గొన్నారు.

## వాటర్ ట్యాంకుపై యువకుల విన్యాసాలు

- ఆందోళనలో తల్లిదండ్రులు


వాటర్ ట్యాంకుపై ఆడుకుంటున్న యువకులు

**మార్కాపురం:** ప్రమాదమని తెలియక.. స్కూల్ నుంచి ఇంటికి రాగానే విద్యార్థులు, యువకులు ఇంటికి దగ్గరలో ఉన్న వాటర్ ట్యాంకుపై ఎక్కి ఆడుతున్న ఆటలు.. చేస్తున్న విన్యాసాలు తల్లిదండ్రుల గుండెల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. మార్కాపురం పట్టణ పరిధిలోని పూలసుబ్బయ్య కాలనీలో ఉన్న వాటర్ ట్యాంకుపైకి వారం రోజులుగా విద్యార్థులు స్కూల్ నుంచి రాగానే సాయంత్రం పూట ఎక్కి రకరకాల ఆటలు ఆడుతున్నారు. ప్రమాదవశాత్తు కాలుజారి అటు కిందపడినా.. ఇటు ట్యాంకులో పడినా.. ప్రాణాలు పోవడం ఖాయం. దీంతో ఆ ప్రాంతాల్లో ఉండే తల్లిదండ్రులు ట్యాంకు వద్ద వాచ్‌మెన్‌ను నియమించాలని కోరుతున్నారు.

## మాజీ సైనికుల వైద్యశాలకు ఎలక్ట్రికల్ ఆటో వితరణ


ఆటోను అందజేస్తున్న డాక్టర్ హరినాథరెడ్డి

**గిద్దలూరు రూరల్:** స్థానిక డి.జి.ఆర్.వైద్యశాల అధినేత డా.హరినాథరెడ్డి పట్టణ శివారులోని నంద్యాల రోడ్డులోని మాజీ సైనికుల వైద్యశాలకు రూ.3.75 లక్షల విలువైన ఎలక్ట్రికల్ ఆటోను ఉచితంగా అందజేశారు. పట్టణంలోని నుంచి మాజీ సైనికుల వైద్యశాలకు వెళ్లే రోగుల సౌకర్యార్థం ఆటోను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డా.హరినాథరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను లెక్కచేయక అహర్నిశలు శ్రమించిన మాజీ సైనికుల వైద్య సేవలకు ఉపయోగపడేందుకు ఆటోను అందజేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మాజీ సైనికులు డా.హరినాథరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సంఘం నాయకులు వైద్యశాల బృందం పాల్గొన్నారు.

## ఘనంగా యూటీఎఫ్ విజయోత్సవాలు


సంబరాల్లో పాల్గొన్న యూటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

**పొదిలి:** యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి విజయోత్సవాలు నిర్వహించారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపి మూర్తి విజయం సాధించిన సందర్భంగా ఈ సంబరాలు చేస్తున్నట్లు జిల్లా కార్యదర్శి పి.బాల వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యాలయం నుంచి ప్రధాన రహదారిలో విశ్వనాథపురం సెంటర్ వరకు ర్యాలీ జరిగింది. అంతకు ముందుగా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత చెన్నుపాటి లక్ష్మయ్య 56వ వర్ధంతి నిర్వహించారు. లక్ష్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు పి.రమణారెడ్డి, పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సానికొమ్ము సత్యనారాయణరెడ్డి, పాలడుగు వెంకటేశ్వర్లు, సీహెచ్.కోటేశ్వరరావు, కామేశ్వరరావు, బాదుల్లా, మదార్‌వలి, బాలకాశిరెడ్డి, మేడం శివారెడ్డి, రవీంద్రబాబు, గాలిముట్టి రమేష్, టి.శ్రీనివాసులు, జీసీహెచ్.ఓబులరెడ్డి, సింగనపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రయాణికులతో మర్యాదగా ఉండాలి

- డీఎం నరసింహులు


నగదు చెక్కు అందజేస్తున్న డీఎం నరసింహులు

**మార్కాపురం టౌన్:** ఆర్టీసీకి ప్రయాణికులే మూలాధారమని, వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాలని ఆర్టీసీ డీఎం ఏఎస్ నరసింహులు అన్నారు. సోమవారం ఆర్టీసీ డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినంద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు ఎంతో నమ్మకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్నారన్నారు. వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్‌పై ఉండగా వారి పట్ల మర్యాదగా ప్రవర్తించాల్సిన బాధ్యత కండక్టర్‌పై ఉందన్నారు. ప్రశంసలు అందుకున్న డ్రైవర్‌లు, కండక్టర్‌లు టీవీఎస్ రావు, చెన్నయ్య, టి.మల్లయ్య, వీబీ కాశయ్య, ఎంబీ కాశయ్యలు ఉన్నారు. ఆర్టీసీ సిబ్బంది, డ్రైవర్‌లు, కండక్టర్‌లు పాల్గొన్నారు.


గజమాలతో నాయకులకు సన్మానం

### కార్యకర్తలకు అండగా ఉంటాం..

కష్టకాలంలో కార్యకర్తలకు అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మాజీ మంత్రి రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ కేపీ నాగార్జునరెడ్డి భరోసా ఇచ్చారు. గిద్దలూరులోని విఠా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నాయకులను గజమాలతో అభిమానులు సత్కరించారు.

– బేస్తవారిపేట


వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి